ABN
ఆంధ్రజ్యోతి

# మెట్రో టేక్ ఓవర్ మార్చికల్లా పూర్తి చేయాలి



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోరైల్ టేక్ ఓవర్ ప్రక్రియను ఈ ఆర్థిక సంవత్సరాంతానికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యదర్శుల స్థాయి కమిటీ, ఎల్అండ్‌టీ అధికారులతో మంగళవారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మెట్రోరైల్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియపై తాజా పరిస్థితిని సమీక్షించారు. ఇరు పక్షాలు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బదలాయింపు సజావుగా, వేగవంతంగా పూర్తి కావాలని సూచించారు. రాబోయే వంద రోజుల్లో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. టేక్ ఓవర్ ప్రక్రియపై ఏర్పాటు చేసిన ట్రాన్సాక్షన్ అడ్వైజర్ ఐడీబీఐ ఈ మేరకు తన నివేదికను త్వరితగతిన పూర్తి చేసి బదలాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని, ఇందులో ఎల్ అండ్‌టీ పూర్తి సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ఆ తర్వాత ఆపరేషనల్, మెయింటనెన్స్‌కు సంబంధించి ప్రతిపాదనలను రూపొందించాల్సిందిగా హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్‌కు సీఎస్ సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు (అర్బన్ ట్రాన్స్‌పోర్ట్) ఎన్వీఎస్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ ఎండీ కేవీబీ రెడ్డి, ఐడీబీఐ అధికారులు, హెచ్ఎంఆర్ఎల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డీవీఎస్ రాజు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మెట్రో రైలు మొదటిదశ ప్రాజెక్టు స్వాధీనంపై అధికారులతో సమావేశమైన సీఎస్ రామకృష్ణారావు

17/12/2025 | Hyderabad Main_I | Page : 5
Source : https://epaper.andhrajyothy.com